క్లుప్తంగా

25న ఊటీకి స్పెషల్ బస్సు

మదనపల్లె సిటీ: వేసవి సెలవులను పురస్కరించుకుని ఈనెల 25న ఊటీకి స్పెషల్ బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో -2 మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. 25న రాత్రి డిపో నుంచి బయలుదేరి బెంగళూరు, మైసూర్ మీదుగా 26న ఊటీకి చేరుతుందన్నారు. 27న తెల్లవారున ఊటీ నుంచి బయలుదేరి పైకా షూటింగ్ స్పాట్, ముదుమలై ఫారెస్టు, బండిపూర్ ఫారెస్టు మీదుగా మైసూర్‌కి వెళ్లి ప్యాలెస్, జూ పార్కు,బృందావన్ గార్డెన్స్ చూసుకున్న తర్వాత అదే రోజు రాత్రి బయలుదేరి 28న తెల్లవారున మదనపల్లెకు చేరుతుందన్నారు. రానుపోను చార్జీ రూ.2250 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 9959225677, 9160186645 సంప్రదించాలన్నారు.

బి.కొత్తకోట తహసీల్దార్‌గా రఫీక్‌అహ్మద్

బి.కొత్తకోట : బి.కొత్తకోట నూతన తహసీల్దార్‌గా రఫీక్ అహ్మద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ ధనుంజయులు పీలేరుకు బదిలీ అయ్యారు. మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో ధనుంజయులు నుంచి రఫీక్ అహ్మద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

రేపు 'వలంటీర్లకు వందనం'

పీలేరు : స్థానిక వీఎస్‌ఆర్ కల్యాణ మండపంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరవుతారని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామ వలంటీర్లు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

వైభవంగా రథోత్సవం

బి.కొత్తకోట: మండలంలోని గట్టులో ప్రసన్న వెంకటరమణ స్వామి రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణస్వామి ఉత్సవ మూర్తులను రథంలో కొలువుదీర్చి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం నుంచి ప్రారంభమైన రథోత్సవం గట్టు వీధులు, ప్రధాన రహదారుల మీదుగా సాగింది. వీధులను నీళ్లతో శుభ్రపరస్తూ భక్తులు అడుగడుగునా పూజలు చేశారు. రథోత్సవ వేడుక తిలకించేందుకు బి.కొత్తకోట, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఆలయంలో శ్రీవారికి విశేష అలంకరణతో ప్రత్యేక పూజలు చేశారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో నలుగురు ఎంపిక

పీలేరు : స్థానిక ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో నలుగురు ఎంపికైనట్లు కరస్పాండెంట్ అవినాష్‌రెడ్డి తెలిపారు. శనివారం ఇండిక్యూ సాఫ్ట్, బెంగుళూరుకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 132 మంది అభ్యర్థులు హాజరు కాగా, రాత పరీక్షలో నలుగురు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ. 2.8 లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ ప్రజయ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, మధులిక, సురేష్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల చోరీకి విఫలయత్నం

కలికిరి: గొర్రెల చోరీకి దుండగులు విఫలయత్నం చేసిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పత్తేగడ గ్రామం పల్లెలవారిపల్లికి చెందిన మల్లికార్జున, ఇతని భార్య అరుణలు గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రతి రోజూ గొర్రెల దొడ్డి వద్ద వీరు నిద్రిస్తారు. శనివారం తెల్లవారుజామున గొర్రెల దొడ్డి పడుకుని ఉండగా అలజడి వినపడటంతో లేచి చూశారు. దొడ్డిలో నలుగు దుండగులు ఉన్నట్లు గుర్తించి గట్టిగా కేకలు వేశారు. దీంతో దుండగులు ఒక గొర్రెను ఎత్తుకుని పరారయ్యారు. గ్రామస్తులు వెంబడించినా లాభంలేక పోయింది. ఈ మేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ మధుసూదనాచారి తెలిపారు.

జగనన్న కాలనీ లేఅవుట్‌కు భూమి పూజ

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ మల్లారపువాండ్లపల్లె క్రాస్ వద్ద జగనన్న కాలనీ లేఅవుట్‌కు భూమి పూజ నిర్వహించారు. శనివారం లేఅవుట్ వద్ద అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి పూజలు చేశారు. అనంతరం భూమి చదును చేసే కార్యక్రమం చేపట్టారు. పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి స్థలం సిద్ధం చేస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీనరెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, పంచాయతీ కార్యదర్శి సిగ్బతుల్లా తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

తంబళ్లపల్లె : స్థానిక మోడల్ స్కూల్‌లో 20323 – 24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ కోరారు. పదో తరగతి పాసైన విద్యార్థులు అర్హులన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఇంగ్లీష్ మీడియం బోధన ఉంటుందన్నారు. అర్హులైన విద్యార్థులు జూన్ 7వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పదో తరగతి మెరిట్ మార్కులను బట్టి సీట్లు కేటాయిస్తారన్నారు. వివరాలకు 9052153538ను సంప్రదించాలన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ సిరుల పంట

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ సిరుల పంట పండుతోందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గెలసంవారిపల్లి, మల్లిరెడ్డిగారిపల్లి, ఈతచెట్లవారిపల్లి, యర్రంరెడ్డిగారిపల్లి, కొత్తరెడ్డివారిపల్లి, కొత్తపల్లి, రెడ్డివారిపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న చేపడుతున్న సంక్షేమ పథకాలతో పేదలకు ఎంతో లబ్ధి చూకూరుతోందన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్ళినా జగనన్న పాలనమెచ్చి మళ్ళీ సీఎంగా జగన్నన్నే రావాలని కోరుకుంటున్నారన్నారు. ప్రతి ఇంటికి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించుకున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతానికి పైగా నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి గతంలో ఎన్నడూ లేని విధంగా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారన్నారు. పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేని దుష్టచతుష్టయం అసత్య ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. విద్యా వ్యవస్థలో జగనన్న తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులతో పేద విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతవరణంలో చదువుకునే అవకాశం ఏర్పడిందన్నారు. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారన్నారు. అలాగే రైతులకు గ్రామాల్లోనే విత్తనాలు, ఎరువులు ఇవ్వడంతో పాటు పండించిన పంటకు గిట్టుబాటు ధరలను అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అధికారం దక్కించుకోవడమే ధ్యేయంగా ఎన్నిపార్టీలు కలిసినా, ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న జగనన్నకే ప్రజల మద్దతు పుష్కలంగా ఉందన్నారు. అనంతరం గ్రామంలోని గడపగడపకూ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న లబ్ధిని వివరించారు. అదేవిధంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని వైఎస్సార్ రైతు మిత్ర సంఘం సభ్యులకు ప్రభుత్వం నుండి రాయితీతో మంజూరైన వ్యవసాయ ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్, ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, వ్యవసాయశాఖ ఏఓ హేమలత, జెడ్పీటీసీ నిర్మల, సర్పంచ్ మునిభాస్కర, నాయకులు నరసింహులు, నీళ్ళ భాస్కర్, ఆనంద, రాయుడు, వేణు రెడ్డి, చంద్రశేఖర్, నాగార్జున, రాజబాబు, విశ్వనాథ్, రవి, చలపతి, షాహెద్‌లు పాల్గొన్నారు.



రాయితీతో మంజూరైన వ్యవసాయ ట్రాక్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

పీలేరు : స్థానిక బాలాజీ టాకీస్ సమీపంలో ఉంటున్న మహమ్మద్ ఆలి శుక్రవారం హత్యకు గురైన విషయం విదితమే. శనివారం ఎమ్మెల్యే పీలేరుకు చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతుని కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. హంతకులను చట్టపరంగా శిక్షించడానికి సహకారం అందిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, షఫీ, హుమయూన్, రెడ్డిబాషా, గడి బాషా, అతికా షఫీ తదితరులు పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు ఆమోదయోగ్యమైన పరిహారం

మదనపల్లె : ఎన్‌హెచ్–42 విస్తరణలో భాగంగా భూసేకరణ కింద భూనిర్వాసితులకు ఆమోదయోగ్యమైన పరిహారం అందేలా కృషి చేస్తామని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. శనివారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో ములకలచెరువు, తంబళ్లపల్లె, బి.కొత్తకోట మండలాల పరిధిలో ఎన్‌హెచ్–42 భూనిర్వాసితులతో పరిహారం నిర్ణయించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... ఎన్‌హెచ్–42 ములకలచెరువు–మదనపల్లె రహదారి భూసేకరణలో భాగంగా మొదటివిడతలో భూనిర్వాసితులకు పరిహారం రూ.20 కోట్లుకు పైగా పంపిణీ చేశామని, మరో 350 మందికి చెల్లింపులు చేయాల్సి ఉందన్నారు. గతంలో సేకరించిన 93 ఎకరాలకు అదనంగా మరో 43.44 ఎకరాల భూమి అదనంగా కావాలని ఎన్‌హెచ్ అధికారులు కోరారరన్నారు. దీనికి సంబంధించి ములకలచెరువు, కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లో నోటిఫికేషన్, త్రీడీ, అవార్డ్ ఎంక్వయిరీ చేస్తున్నామన్నారు. గతంలో నోటిఫికేషన్‌కు ప్రస్తుత నోటిఫికేషన్ మధ్యలో 11 నెలల కాలం జరిగినందున ఇందులో ఏవేని అమ్మకాలు, కొనుగోళ్లు జరిగిఉంటే వాటన్నంటినీ పరిగణనలోకి తీసుకుని వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది ద్వారా వివరాలు సేకరించి ప్రభుత్వం నిర్ణయించిన పరిహారాన్ని భూనిర్వాసితుల వ్యక్తిగత ఖాతాలకు జమచేస్తామన్నారు. జాతీయరహదారికి ఆనుకుని ఉన్న భూములు, ఇళ్లు, ఇంటిపట్టాలు, వ్యవసాయ పొలాలు మూడుభాగాలుగా విభజించి, ప్రాథమిక విలువ, విక్రయవిలువ ఏది ఎక్కువగా ఉంటే దానిని తీసుకుని, భూసేకరణ చట్టంలో ఉన్న ప్రాథమిక విలువకు 250 శాతం కలిపి పరిహారం నిర్ణయిస్తామన్నారు. రైతులు జాతీయరహదారి నిర్మాణానికి సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శ్రీనివాసులు, భీమేశ్వరరావు, ధనంజయ, ఎన్‌హెచ్ డీఈ శివరాం పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి, తహసీల్దార్లు

47 క్వింటాళ్ల విత్తన కాయలు సిద్ధం

పెద్దతిప్పసముద్రం: ఖరీఫ్ సీజన్‌లో భాగంగా రాయితీపై రైతులకు అందజేసేందుకు జిల్లాలో 47 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఉమా మహేశ్వరమ్మ అన్నారు. శనివారం ఆమె మండల ఏఓ ప్రేమలతతో కలసి మండలంలోని రాపూరివాంలపల్లి, బూర్లపల్లి, తుమ్మరకుంట, సంపతికోట గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ జిల్లాలోని 400 ఆర్‌బీకేల్లో పని చేసే సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లోనే రైతులకు వివిధ రకాల ప్రభుత్వ సేవలు అందిస్తున్నారన్నారు. జిల్లాలో గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 27 వేల హెక్టార్లలోని రైతులకు విత్తన కాయలు పంపిణీ చేసామన్నారు. అదే విధంగా రెండవ విడతలో జిల్లాలోని రైతు సంఘాల గ్రూపులకు రాయితీపై 98 ట్రాక్టర్లతో పాటు యంత్ర పరికరాలను మంజూరు చేశామన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రతి రైతూ ఆర్‌బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎరువు బస్తాలను రైతులకు అందజేశారు.



ఎరువు బస్తాలను పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ

నవరత్నాలతో సంక్షేమ వెలుగులు

– ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా ప్రతి ఇంట సంక్షేమ వెలుగులు నిండాయని, ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శనివారం మండలంలోని రాచవేటివారిపల్లె, వడ్డిపల్లె తదితర గ్రామాల్లో సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఎంపీపీ నరసింహులు, సింగల్‌విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గారబురుజు రమణారెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానికులు, నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లలో ప్రభుత్వం ఆ కుటుంబానికి అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. బుక్‌లెట్‌ను వారికి అందించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా.. అంటూ ఆరాతీశారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని లబ్ధిదారులను ప్రశ్నించారు. పలువురు గ్రామంలో రోడ్లు,మురుగునీటి కాల్వల నిర్మాణం, తాగునీటి కొళాయిలు, విద్యుత్ స్తంభాల మార్పు, విద్యుత్ లైన్ల సవరింపు చేపట్టాల్సిందిగా ఎమ్మెల్యేకు విన్నవించారు. సమస్యలపై స్పందిస్తూ వెంటనే అధికారులను స్థానికులు పేర్కొన్న సమస్యలపై చర్యలు చేపట్టి పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, వైయస్సార్‌సీపీ రాజంపేట ఎంపీ పార్లమెంటు కార్యదర్శి కొమ్మేపల్లె శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ రెడ్డి వెంకటేష్, నాయకులు ఆర్.శ్రీనివాసులురెడ్డి, బాబు రెడ్డి, చక్రపాణిరెడ్డి, యుగంధర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, శ్రీనివాసులు, నవీన్, మాజీ సర్పంచ్ నాగరాజ, షావలి, సర్పంచ్‌లు మహదేవరెడ్డి, చెంద్రాయుడు, తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభం

రామసముద్రం: మండలంలోని మినికి గ్రామంలో వెలసిన శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి అంకురార్పణ , ధ్వజారోహణం, బలిహరణ ఉత్సవం నిర్వహించారు. రాత్రి అభిషేకము, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు. రాత్రి సీతారామాంజనేయస్వామి ఊరేగింపు నిర్వహించారు. 21న ఉదయం కళశారాధనం, హోమం, బలిహరణ, మంగళహారతి, రాత్రి 8 గంటలకు శ్రీస్వామివారి కళ్యాణోత్సవము వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 22న ఉదయం 8 గంటలకు కళశారాధనం, హోమం, మహా మంగళహారతి, ఉట్లతిరునాల, అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న కళశారాధనం, ప్రాకారోత్సవం, హోమం, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, పుష్పపల్లకీ, పౌరాణిక నాటకం , 24న వసంతోత్సవము, చక్రస్నానం, మహామంగళహారతి, ధ్వజా అవరోహణము, శయణోత్సవంతో ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేల ఆరోగ్యంతోనే అధిక దిగుబడి

కలికిరి: నేల ఆరోగ్యంతోనే అధిక దిగుబడి సాధ్యమని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని పత్తేగడ రైతు భరోసా కేంద్రంలో శనివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్బీకేల ద్వారా రైతులకు రాయితీతో అందచేస్తున్న జనుము, జీలుగ విత్తనాలు వినియోగించుకుని నేల ఆరోగ్యాన్ని కొంత మేర కాపాడుకుని, పంటలలో సాధారణం కంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రభుత్వం రాయితీతో వ్యవసాయ వినియోగానికి కిసాన్ డ్రోన్‌లు అందచేస్తోందని, వ్యవసాయ డిప్లమా చదివిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డ్రోన్‌తో ఎరువులు తక్కువ సమయంలో పిచికారీ చేసి ఖర్చులు తగ్గించుకోవడం, సమయం ఆదా చేసుకోవచ్చన్నారు. ఆర్బీకేల్లో మట్టినమూనాలు సేకరించి భూసార పరీక్షా కేంద్రం ద్వారా టెస్ట్ అనంతరం సాయిల్ హెల్త్ కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. తదుపరి నేల రకాన్ని బట్టి ఎరువులు వేసుకునే వీలుంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మమతారెడ్డి, ఏఏబీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, వీఏఏ సాయిలోకేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ బాధితులకు పౌష్టికాహారం అందజేత

మదనపల్లె : టీబీ వ్యాధిగ్రస్తులు మందులతో పాటుగా పోషకాహారాన్ని తీసుకున్నప్పుడే క్షయ తొందరగా నయమవుతుందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్తభారత అభియాన్ నిక్షయ్‌మిత్ర పథకం ద్వారా టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని కోరారు. శనివారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో నిర్ధారిత టీబీ రోగులకు వారి సమ్మతితో వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, మరికొందరు దాతల సహకారంతో పౌష్టిక ఆహార పదార్థాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీబీ రోగులు మందులు వాడే ఆరునెలల పాటు ప్రతి నెలా పౌష్టికాహారాన్ని వివిధ ఆహార ధాన్యాలను వస్తు రూపంలో సహాయం చేసేందుకు దాతలు ముందుకు రావాల్సిందిగా వైద్యులు కోరినప్పుడు తనతోపాటుగా వైఎస్సార్ సీపీ సర్పంచులు,ఎంపీటీసీలు, నాయకులు కొంతమందిని ఇందులో భాగస్వామ్యం చేయడం జరిగిందన్నారు. అనంతరం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలి, సీనియర్ వైద్యులు రామమూర్తినాయక్, ఆంజనేయులు, పాల్‌రవి కుమార్, టీబీ మెడికల్ ఆఫీసర్ శ్రీధర్,లతో కలిసి టీబీ వ్యాధిగ్రస్తులు 150 మందికి ఒకొక్కరికి రూ.700 విలువచేసే పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.

ఆలయ ఆస్తుల రిజిస్టర్లు అందజేయాలి

–దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్

మదనపల్లె సిటీ: హిందూ దేవాలయాల ప్రాపర్టీ రిజిస్టర్లు వెంటనే దేవదాయశాఖకు అందజేయాలని దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ అన్నారు. శనివారం స్థానిక చిప్పిలిలోని యోగభోగేశ్వరస్వామి ఆలయంలో అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో అర్చకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్చకుల ఆధీనంలో ఉన్న ఇనాం భూములు వివరాలకు తెలియజేయాలన్నారు. అర్చకుల వెల్ఫేర్ ఫండ్ కింద తీసుకున్న లోన్లు సకాలంలో చెల్లించాలన్నారు. దేవాలయాల్లో నిర్మాణ పనులు దేవదాయశాఖ అనుమతితో చేపట్టాలన్నారు. దీప, దూప,నైవేద్యం కింద మంజూరు కాని ఆలయాల వివరాలు వెంటనే తెలియజేయాలన్నారు. ఇంటి పట్టాలు మంజూరుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామన్నారు. ఈఓ మునిరాజ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, సిబ్బంది అంకన్న, అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షులు చెన్నకేశవయ్య, మంజునాథ్ పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో విశిష్టమైన పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించారు. తోమాల సేవ, ఏకాంత సేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామి వారిని సేవించుకొన్నారు.

'క్రీడలతో స్నేహభావం పెరుగుతుంది '

కురబలకోట: క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల ప్రత్యేక పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి అన్నారు. శనివారం ఉదయం కురబలకోట జెడ్పీ హైస్కూల్‌లో వైఎస్సార్ సీపీ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ప్రారంభించారు. నియోజక వర్గ స్థాయిలో పది రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడంతో పాటు యువతలో స్నేహ భావాన్ని పెంచడానికి టోర్నమెంట్ దోహదపడుతుందన్నారు. మొదటి స్థానంలో నిలచిన టీమ్‌కు రూ. 30 వేలు, ద్వితీయ స్థానంలో నిలచిన టీమ్‌కు రూ. 15 వేలు నగదు బహుమాన్ని అందజేయనున్నట్లు ఆర్గనైజర్లు, వైఎస్సార్ సీపీ మండల యూత్ లీడర్ బాబి, వినోద్ తెలిపారు.

ప్రజారోగ్యమే ప్రథమ కర్తవ్యం

పీలేరు రూరల్ : పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజారోగ్యమే ప్రథమ కర్తవ్యమని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. శనివారం పట్టణంలోని కావలిపల్లె, ఆర్టీసీ నల్లగుట్ట, ఎల్‌బీఎస్ రోడ్డు, పద్మావతి నగర్, చిత్తూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పనులు పర్యవేక్షించిన సర్పంచ్ మాట్లాడుతూ పీలేరును పరిశుభ్రంగా ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరారు. చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు ఎక్కడపడితే అక్కడ వేయరాదని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవో ప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎంపీటీసీ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

పల్లెబాట పట్టిన ఉపాధ్యాయులు

పెద్దతిప్పసముద్రం: స్థానిక మోడల్ స్కూల్ సిబ్బంది పల్లెబాట పట్టారు. ఆరు, ఇంటర్ ప్రవేశాల కోసం ప్రిన్సిపల్ శివకుమారి సిబ్బందితో కలసి ఆటోలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రచారం చేస్తున్నారు. శనివారం మండలంలోని మల్లెల, బూర్లపల్లి పంచాయతీల్లో పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. మోడల్ స్కూల్‌లోని మౌలిక వసతులతో పాటు విద్యార్థుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత సౌకర్యాలను వివరించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉంటూ ప్రతి ఏటా 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరారు.